తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
3 జూన్ 2026
పేజీలు : 08



# దూందాంగా ఆవిర్భావ వేడుకలు

## మేడ్చల్-మల్కాజిగిరిలో మిన్నంటిన ఉత్సాహం

- మేడ్చల్ జిల్లాలో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు
- తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంతో ముందుకు
- అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు
- మహిళలు, రైతులు, విద్యార్థులకు సంక్షేమ పథకాలు
- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలు కొనసాగుతున్నాయి

**మేడ్చల్, జూన్ 2 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ప్రాంగణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారు డా. కే. కేశవరావు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, డీసీపీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. వేడుకల ప్రారంభానికి ముందు కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్, కీసర ఎమ్మార్వో యాదగిరిరెడ్డి పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులు అర్పించారు.

డా. కే. కేశవరావు మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తై 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు ఘన నివాళులు అర్పించారు. గత సమస్యల నుంచి బయటపడుతూ దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో రాష్ట్రం ప్రపంచ స్థాయిలో నెంబర్ వన్‌గా ఎదగాలనే లక్ష్యం తో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక, సామాజిక, పరిపాలనా రంగాల్లో ఆదర్శవం తమైన లక్ష్యాలతో రూపొందించిన ఈ విజన్ డాక్యుమెంట్ భవిష్యత్ తెలంగాణకు మార్గదర్శకమ ని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని CURE, PURE, RAREగా వర్గీకరించి సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలి పే ప్రణాళికలు రూపొందించామని వివరించారు.

ప్రజా ప్రభుత్వం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను చేపట్టిందని అన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు వార్డు, మండ ల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్, రోడ్డు భద్రత, సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, యువత, మహిళ లు, పర్యావరణం వంటి 10 ముఖ్య అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలతి, మైనార్టీ అధికారి జి. కాంతమ్మ, కలెక్టరేట్ ఏఓ సుజాత, వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, సివిల్ సప్లైస్ డీఎం సుగుణబాయి, డీఎస్‌వో శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ సాంబశివరావు, ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ఇంటర్మీడియట్ అధికారి కిషన్, డీటీవో వెంకటేశ్వర్లు, అధికారులు, పాల్గొన్నారు.



# తాండూర్‌లో రూ.10 కోట్లతో 100 మహిళా సమాఖ్య భవనాలు

- ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున కేటాయింపు
- నాణ్యతతో వెంటనే పనులు ప్రారంభించాలి
- గ్రామీణ మహిళల సాధికారతకు దోహదం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.

**తాండూరు జూన్ 2జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దాదాపు 100 మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వెల్లడించారు. పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు వివరించారు. నూతనంగా మంజూరైన భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తూ తక్షణమే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవాలని, మహిళా సంఘాలకు త్వరగా భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ భవనాల నిర్మాణంతో మహిళా సంఘాలు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉత్పత్తుల నిల్వకు సొంత వసతి లభిస్తుందని, గ్రామీణ మహిళల సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు.





## జాతీయ జెండాను ఆవిష్కరించిన... ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి

**మహేశ్వరం,జూన్2(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భ ంగా మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం ఈ సిటీలోని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ తరుణ్ జోషి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యారంగం పురోగతి సాధించాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో ఆదరణ పెరుగుతుంది : డీఈవో వెంకటేశ్వర్లు

**మహేశ్వరం,జూన్ 2(జనంసాక్షి):** విద్యారంగం మరింత పురోగతి సాధించాలని రంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచితంగానే దుస్తులను,పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆదరణ పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్ రావు, ఎంఈఓ కస్నా నాయక్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాల్లో రభస..

- తాండూరు మున్సిపాలిటీలో అధికారుల మధ్య గొడవ
- క్షమాపణ కోరుతూ సిబ్బంది నిరసన
- భోజనాల ఏర్పాట్లపై మాటామాటీ
- కార్యక్రమాలకు తాత్కాలిక అంతరాయం



**తాండూరు, జూన్ 2 (జనంసాక్షి):** మహిళా వారోత్సవాల సందర్భంగా తాండూర్ మున్సిపాలిటీ మెప్మా విభాగంలో అధికారుల మధ్య వివాదం చోటుచేసుకుంది. మున్సిపాలి టీ మేనేజర్ నరేందర్ రెడ్డి, మెప్మా ఇన్‌చార్జ్ రాజేందర్ మధ్య భోజనాల ఏర్పాట్ల విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది.

ఈ వివాదం నేపథ్యంలో మెప్మా సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నరేందర్ రెడ్డి క్షమాపణ చెప్పే వరకు తాము కదలేదని భీష్మించి అక్కడే కూర్చున్నారు. దీంతో మహిళా వారోత్సవాల కార్యక్రమాలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. సిబ్బంది ఆరోపణల ప్రకారం మేనేజర్ ప్రవర్తన అనుచితంగా ఉందని, అందుకే క్షమాపణ కోరుతున్నామని తెలిపారు. స్థానిక అధికారులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలతో చర్చలు జరుపుతున్నారు. మహిళా వారోత్సవాల కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది.

### యాచారంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

# జాతీయ జెండాను ఆవిష్కరించిన బీజేపీ శ్రేణులు

**యాచారం, జూన్ 02(జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ యాచారం మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో భారతీయ జనతా పార్టీ పాత్ర అత్యంత కీలకమైందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీజేపీ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేసిందని పేర్కొన్నారు. "త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిద్దాం. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ రాష్ట్రం సుభిక్షంగా, సమృద్ధిగా వర్ధిల్లాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు గోగికర్ రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు నాయిని పాండురంగ



రెడ్డి, నడికుడి కృష్ణ, ముదిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ గుప్తా, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, బీజేవైఎం నాయకులు శాంతి కుమార్, కార్యదర్శి సాటు మల్లేష్, యాచారం వార్డు సభ్యులు మస్కు యాదయ్య, మారోజు ప్రదీప్, జెల్ల శ్రీనాథ్ గౌడ్, కొండాపురం బాలరాజు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు గడ్డం దయాకర్, జెల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బంట్వారం పోలీస్ స్టేషన్లో రాష్ట్ర అవతరణ వేడుకలు



**బంట్వారం మే 02 (జనం సాక్షి)** బంట్వారం పోలీస్ స్టేషన్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎస్సై విమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పోలీస్ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## చిన్న రావిరాలలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా అవగాహన సమావేశం

- ఏకో టౌన్ వల్ల కలిగే ప్రమాదాలపై గ్రామ ప్రజలకు అవగాహన
- డంపింగ్ యార్డ్ మాకు వద్దు
- గ్రామసర్పంచ్ పబ్బతి బాలకిషన్

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 2(జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండల చిన్న రావిరాల గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ప్రతిపాదిత ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) వల్ల గ్రామాలకు కలిగే నష్టాలు, పొంచి ఉన్న ప్రమాదాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూమి కాలుష్యం తీవ్రంగా పెరిగే ప్రమాదం ఉందన్నారు. కాలుష్యం కారణంగా పంటల ఉత్పత్తి దెబ్బతినడంతో పాటు ప్రజల్లో వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్య సమస్యలు మరింత తీవ్రం అవుతాయని హెచ్చరించారు. అలాగే సమీప గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు కలిసి రావడం లేదని చేసిన విమర్శలు సరికావని పేర్కొన్నారు. ఆయన ఒంటెద్దు పోకడల కారణంగానే పలువురు దూరంగా ఉంటున్నారని, తమపై విమర్శలు చేయడం తగదని




అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, అభవతి బాలయ్య, రిషిత సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ నీరునేముల కిష్టయ్య, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం లింగారెడ్డి తదితర గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాచారం గ్రామ పంచాయతీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

### మొగుళ్ళ వంపు, గాండ్ల గూడలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం



**యాచారం, జూన్ 2(జనం సాక్షి )** యాచారం గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ సర్పంచ్ అనిత శరణం అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల ను మొగుళ్ళ వంపు మరియు గాండ్ల గూడ లలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు దక్కాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగ కృష్ణ, హౌసింగ్ ఏఈ శిరీష, వార్డు సభ్యులు మరోజు ప్రదీప్, లక్ష్మి వెంకట్ రెడ్డి, సాజిద్, పాషాబాయి, నారిమళ్ళ శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాటం కొనసాగాలి

**ముషీరాబాద్, జూన్ 02 (జనం సాక్షి):** అమరుల త్యాగాలను మరవకుండా ప్రజాస్వామిక తెలంగాణ లక్ష్యాలను సాధించే దిశగా పోరాటాన్ని కొనసాగించాలని పలువురు వక్తలు సూచించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమోని నాగభూషణం అధ్యక్షతన తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సు తెలంగాణ ఉద్యమ చరిత్ర, అమరుల త్యాగాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ సదస్సు కు ముఖ్య అతిథిగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చింతకింది కాసిం, పాశం యాదగిరి, అంబటి నాగయ్యలు హాజరై మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి




సంవత్సరాలు గడిచినా ప్రజల ఆశయాలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువత, మేధావులు చేసిన త్యాగాలు అపారమని, వాటిని కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. భూమి, నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సామాజిక న్యాయం, ప్రజాస్వామిక హక్కులు సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వాల వైఖరిపై విమర్శలు వ్యక్తం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని, ప్రజాస్వామిక వాదులపై దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెంతన సంజీవరావు, గంగపురం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాటసింగారం పండ్ల మార్కెట్‌లో

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 2(జనం సాక్షి ):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలందరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మేకం లక్ష్మి, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బండి మధుసూదన్ రావు తదితరులు, మార్కెట్ ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# పెద్ద అంబర్‌పేట్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 2(జనం సాక్షి ):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద అంబర్‌పేట్‌లోని నాగోల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం కార్యాలయ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సర్కిల్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## ఉప్పల్ సీఐ సురేష్‌రెడ్డికి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి



**ఉప్పల్, జూన్ 2 (జనం సాక్షి):** ఉప్పల్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ రెడ్డికి పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన పదోన్నతుల జాబితాలో ఆయనకు అడిషనల్ ఎస్పీ హోదా కల్పించింది. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సురేష్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, పోలీసు సేవలను మరింత చేరువ చేయడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. చట్ట అమలులో క్రమశిక్షణతో పాటు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం ఆయన పనితీరుకు ప్రత్యేకతగా నిలిచిందని సహచర అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు 33 సంవత్సరాలుగా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన సురేష్ రెడ్డి అనేక కీలక కేసుల దర్యాప్తులో తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పించడం పట్ల పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు సురేష్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ, ఆయన మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

### ఉపాధి హామీ,చెరువుల పూడికతీత పనుల విస్తృత తనిఖీపనులను

## పరిశీలించిన ఎంపీడీఓ రాధారాణి



**యాచారం, జూన్ 2(జనం సాక్షి )** యాచారం గ్రామం లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఎంపీడీఓ రాధారాణి మంగళవారం పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులతో పాటు, చిన్న నీటిపారుదల చెరువుల పూడికతీత పనులను మరియు నూతనంగా నిర్మిస్తున్న గ్రామీణ రహదారి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.అలాగే, రహదారి పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. కూలీలకు ఉపాధి హామీ నిబంధనల ప్రకారం వేసవి కాల దృష్ట్యా తాగునీరు, నీడ వంటి అన్ని వసతులు కల్పించాలని మరియు పనుల రికార్డులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

## గున్‌గల్‌లో 'స్వచ్ఛతా హి సేవా', 'సురక్షిత జలవాయు' కార్యక్రమం

- డంపింగ్ యార్డును పరిశీలించి, మొక్కలు నాటిన గ్రామ సర్పంచ్
- గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ




**యాచారం, జూన్ 02(జనం సాక్షి )** యాచారం మండల పరిధిలోని గున్‌గల్ గ్రామపంచాయతీలో 'స్వచ్ఛతా హి సేవా' మరియు 'సురక్షిత జలవాయు' కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి అధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని డంపింగ్ యార్డును సందర్శించి పరిశుభ్రత పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా గ్రామ పరిధిలో ఆయన మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. గున్‌గల్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శోభారాణి, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, మచ్చ లక్ష్మణ్, ఉపసర్పంచ్ మచ్చ అనిల్ కుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గులో ప్రోటో కాల్ రగడ

- రేగడి చిల్కమర్రి మహిళ సర్పంచ్‌కి అవమానం
- ఎంపీడీఓ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేతల నిరసన




**జనంసాక్షి(కొందుర్గు)** రంగారెడ్డి జిల్లాల్లోని కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని, గ్రామ ప్రథమ పౌరురాలైన మహిళా సర్పంచ్‌ను తీవ్రంగా అవమానించారని ఆరోపిస్తూ కొందుర్గు మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు మంగళవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలచే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా, కార్యక్రమానికి ఆహ్వానించకుండా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాన్ని నిర్వహించడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. స్థానిక సంస్థల గౌరవాన్ని దెబ్బతీస్తూ, ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి ప్రభుత్వ కార్యక్రమాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తప్పనిసరని వారు గుర్తుచేశారు. కార్యక్రమ నిర్వహణలో ప్రోటోకాల్ పాటించడంలో విఫలమైన ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ, అలాగే ఇందులో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈ విషయంపై ప్రజలకు బహిరంగ వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ శ్రీరాములు కు బీఆర్ఎస్ మండల నాయకులు కలిసి లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. ప్రజలచే ఎన్నికైన ఒక మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన ఈ అవమానాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య వెంటనే ఈ విషయంపై దృష్టి సారించి ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కావేరినగర్‌లో రూ.40 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు

### పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, జూన్ 2 (జనం సాక్షి):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని కావేరి నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ శ్రీమతి రజిత పరమేశ్వర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. కాలనీవాసులతో కలిసి పనుల పురోగతిని తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల కాలనీలో పర్యటించిన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను గుర్తించిన రజిత పరమేశ్వర్ రెడ్డి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను కోరినట్లు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తయితే కాలనీలోని మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కావేరి నగర్‌ను ఆదర్శవంతమైన కాలనిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎన్. సుధాకర్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, వై.కే. నాయుడు, ఎన్. శ్రీనివాస రెడ్డి, వెంకటేష్ గుప్తా, ప్రసాద్ కె.వి., రఘుపతి రెడ్డి, లక్ష్మి రెడ్డి, నవీన్ చారి, అప్పుల మురళి, మోహన్ రెడ్డి, పోచయ్య, ఖాసీం, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళీ చారి, ప్రవీణ్ గౌడ్, అనంతయ్య, డి. సృజనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం

- తెలంగాణ కోసం నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి.
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి.



**తాండూరు జూన్ 2(జనంసాక్షి)** తాండూరులో ఉద్యమకారుల జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కార్యకర్తల త్యాగాలను, పోరాట వైభవాన్ని గుర్తుచేశారు. గత 12 ఏళ్లుగా తెలంగాణ కోసం నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "పోరాటం మాది... పదవులు వారివి" అని వారు వ్యాఖ్యానించారు. ఉద్యమ సమయంలో కార్యకర్తలపై పెట్టిన కేసులు ఇప్పటికీ ఎత్తివేయలేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ గుర్తింపు లేదని వాపోయారు. ఈ సన్నాహక సమావేశాల ద్వారా ప్రభుత్వాన్ని మేల్కొలిపే పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పిడమర్తి రవి మాట్లాడుతూ, ఉద్యమకారుల డిమాండ్లు నెరవేరే వరకు గ్రామాలు తిరిగి అందరినీ ఏకం చేస్తానని తెలిపారు. అనంతరం కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఉద్యమకారులకు మద్దతు తెలిపి ఘనంగా సన్మానించారు. జిల్లా ఉద్యమ నాయకులు, వివిధ మండలాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు జూన్ 2( జనంసాక్షి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మహిళా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వారోత్సవాలలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిర మహిళా శక్తి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీతో పాటు ఇందిరమ్మ చీరలు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంకు గాను బ్యాంక్ లింకేజు ద్వారా 212 సంఘాలకు రూ.28.19 కోట్లు.వడ్డీలేని రుణాలు .1001 సంఘాలకు రూ. 1,61,64,759(ఒక్క కోటి అరవై ఒక్క లక్ష, అరవై నాలుగు వేయిల, ఏడువందల యాభై తొమ్మిది)స్త్రీ-నిధి ద్వార 332 సంఘాలకు రూ.6.67 కోట్ల రుణం మంజూరు.పట్టణంలో విధీ వ్యాపారులకు (దాదాపు 5000మందికీ) గాను దాదాపు రూ.8 కోట్ల రుణం మంజూరు. పట్టణంలో 18,600 మహిళాలకు ఇందీరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మహిళ సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నాం.ముఖ్యమంత్రి తాండూర్ నియోజకవర్గంకు 4 ఆర్టీసీ బస్సులు కేటాయించడం జరిగిందని తెలిపారు.మహిళా సంఘాలకు ఆదాయ వనరులు చేకూర్చాలని ఉద్దేశ్యంతో వడ్ల కొనుగోలు కేంద్రాలు, చిరు వ్యాపారాలు, స్కూల్ యూనిఫామ్స్ తయారీ, మహిళా శక్తి క్యాంటీన్స్, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా విద్య సంస్థలలో మౌలిక సదుపాయల కల్పన మహిళ సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు.అదే విధంగా తాండూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మహిళా సమైక్య భవనలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ప్రజా పాలనలో స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు వడ్డీ రహిత రుణాలు, ఉపాధి అవకాశాలు, వంటి కార్యక్రమాల ద్వారా మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.నూతనంగా మంజూరైన మహిళా సమైక్య భవనాల పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తెలంగాణ సాధనకై ఉద్యమిస్తాం!

- అమరవీరుల ఆశయాలను నెరవేర్చే దిశగా సీపీఐ పోరాటాలు
- ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి
- హయత్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



**హయత్ నగర్, జూన్ 2 (జనం సాక్షి)** నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం ఎంతోమంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హయత్‌నగర్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో, లెక్చరర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు బొంగు అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ హయత్‌నగర్ సీనియర్ నాయకులు కామ్రేడ్ రాములు ఎర్రజెండాను ఆవిష్కరించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం, వేలాది మంది బలిదానాల ఫలితంగానే మనకు సొంత రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. అయితే, ఏ ఆశయాల కోసం అయితే తెలంగాణ ఏర్పడిందో ఆ లక్ష్యాలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ, వాటి ఫలాలు ఇంకా అట్టడుగు వర్గాలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు దక్కే నిజమైన “సామాజిక తెలంగాణ”సాధన కోసమే సీపీఐ నిరంతరం ఉద్యమిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. పేదల పక్షాన ఎర్రజెండా ఆధ్వర్యంలో భవిష్యత్తు లోనూ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జరిగిన ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సీపీఐ లెక్చరర్స్ కాలనీ డివిజన్ కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, హైకోర్టు కాలనీ డివిజన్ కార్యదర్శి చెంది వెంకట్, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు మండల కార్యదర్శి కొప్పుల సరిత, ఏఐటీయూసీ మండల కార్యదర్శి పట్టేటి శేఖర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు వెంకన్న, డిహెచ్పిఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, డిహెచ్పిఎస్ మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, గిరిజన సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి జైపాల్, బీసీ సంఘం మండల కార్యదర్శి బాలరాజు, బి ఓ సి నాయకులు వీరస్వామి, రామకృష్ణ, వివిధ శాఖ కార్యదర్శులు సౌజన్య, యమున, సుమతి, సౌజన్య, రజిత, శివ జ్యోతి, కృష్ణ లీల, పద్మ, సుజాత, జ్యోతి, శిరీష, కవిత, చెంది రాములు, ముత్తయ్య, పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ సి డిపార్ట్మెంట్ రాష్ట్ర అధికార ప్రతినిధి నియామక పత్రాన్ని పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ నుండి స్వీకరించిన డాక్టర్ ఆరెపల్లి రాజేందర్

**బంట్వారం 02 జూన్ (జనం సాక్షి)** హైదరాబాద్ లోని టూరిజం ప్లాజాలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన టీపీసీసీ ఎస్ సి డిపార్ట్మెంట్ రాష్ట్ర అధికార ప్రతినిధి నియామక పత్రాన్ని పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నుండి అధికార లేఖను స్వీకరించిన డాక్టర్ . ఆరెపల్లి రాజేందర్ . ఈ కార్యక్రమంలో డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య ములుగు రాజు ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో
# తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**తాండూరు జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 24వ వార్డు కౌన్సిలర్ పి. బాలకృష్ణ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి త్యాగాలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. కార్యక్రమం అనంతరం కేంద్రంలోని చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో 24వ వార్డు ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**పెద్దేముల్ జూన్ 02(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రధాన కూడలివద్ద మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేసి తెలంగాణ తల్లి చిత్రపటానికి,పూలమాలలు వేసి నివాళులర్పించారు.జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించి, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 60 ఏళ్ల పోరాట ఫలితంగా కేసీఆర్ గారి అలుపెరగని ఉద్యమంతో తెలంగాణ సాధించుకున్నాం.10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది. కాళేశ్వరంతో సస్యశ్యామలం అయ్యింది, రైతుబంధుతో రైతు రాజు అయ్యాడుఅని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు.పెద్దేముల్ సర్పంచ్ డివై.నర్సిములు. ఉప సర్పంచ్ డివై ప్రసాద్.బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రుక్మాపూర్ రమేష్, జనార్దన్ రెడ్డి,సిబ్లి,వీరప్ప,అంజి,వెంకటేష్ చారి,పాండు నాయక్,నర్సిములు, తదితరులు పాల్గొన్నారు

# వికారాబాద్ కొత్త ఆర్టీఓగా సుభాష్ చంద్రరెడ్డి



**వికారాబాద్ జూన్ 2, (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి (ఆర్టిఓ)గా సుభాష్ చంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఇబ్రహీంపట్నం ఆర్టిఓగా విధులు నిర్వహించి, తాజాగా వికారాబాద్‌కు బదిలీపై వచ్చారు. వికారాబాద్ ఆర్టిఓగా పనిచేసిన పి. వెంకటరెడ్డి ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు, సిబ్బంది నూతన ఆర్టిఓ సుభాష్ చంద్రరెడ్డికి స్వాగతం పలికి, వారి నాయకత్వంలో శాఖ సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సుభాష్ చంద్రరెడ్డి తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ సంబరాలు



**రాజేంద్రనగర్,జూన్2 (జనంసాక్షి)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్, బండ్లగూడ జాగిర్, హైదర్‌షాకోట్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ జాగిర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాలు, కేసీఆర్ నాయకత్వ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వి. రాముడు యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ అమరవీరులకు ఘన నివాళి.



**మేడ్చల్, జూన్ 2 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగవంతమైందని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతున్నాయని వివరించారు. గౌరవ ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు, సాహితీ అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### తాండూర్ నియోజకవర్గ సర్ కన్వీనర్‌గా

## కర్ణం పురుషోత్తం రావు నియామకం



**తాండూరు జూన్ 2(జనంసాక్షి)** ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున తాండూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా సీనియర్ నాయకులు, న్యాయవాది కర్ణం పురుషోత్తం రావును నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రకటించారు. సర్ లో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ మ్యాపింగ్ అత్యంత కీలకమైన ముందస్తు ప్రక్రియ అని ఎమ్మెల్యే తెలిపారు. 2002-2004 మధ్య జరిగిన చివరి సర్ రికార్డులను ప్రస్తుత ఓటర్ల జాబితాతో పోల్చి, ప్రతి ఓటరును వారి పాత రికార్డులు లేదా కుటుంబ మూలాలతో అనుసంధానించడమే ఈ మ్యాపింగ్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే తాండూర్ నియోజకవర్గంలోని మొత్తం 269 పోలింగ్ బూత్‌లకు పార్టీ తరపున బూత్ లెవెల్ ఏజెంట్లను (బిఎల్ఏ) నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. నియమితులైన బిఎల్ ఎల అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ, సర్ ప్రక్రియ సజావుగా సాగేలా చూసే బాధ్యతను కర్ణం పురుషోత్తం రావు పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవవేడుకలు



**తాండూరు జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం తాండూరులోని పైలెట్ రోహిత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నాయకులు జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ జెండా ను ఆవిష్కరించారు. ఆ తరువాత పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఎన్నో ఏళ్ల ఉద్యమం, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని తెలిపారు.

## ఉప్పల్‌లో తెలంగాణ జోరు.. ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో రాజకీయ సందడి

- బీఆర్ఎస్ -- కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ..
- అమరవీరులకు నివాళులు, తెలంగాణ ఆవిర్భావ స్ఫూర్తిని గుర్తు చేసిన నాయకులు



**ఉప్పల్, జూన్ 2 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉప్పల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్ర ఏర్పాటు జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, ముఖ్య కూడళ్లలో జాతీయ పతాకాలు ఎగురవేసి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ తెలంగాణ పట్ల గౌరవాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మరింత బలపరిచేలా కార్యక్రమాలు సాగాయి. ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలకానగర్ తదితర ప్రాంతాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ జెండాలు, జాతీయ పతాకాలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన వేడుకలు

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన నాయకురాలు సోనియా గాంధీ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత కల్పిస్తూ తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ, పుష్కరాల నిర్వహణ, కళాకారులు, రచయితలు, కవులకు గౌరవం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరవలేమని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళి

మరోవైపు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ కార్యాలయాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల పాటు సాగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజా సంఘాలు అందరి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని, ఎన్నో అవమానాలు, అన్యాయాలు, అసమానతలను ఎదుర్కొని సాధించుకున్న స్వరాష్ట్ర దినమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని, మౌలిక వసతులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

### ఉప్పల్ అంతా తెలంగాణ సంబురాలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, స్వీట్ల పంపిణీ, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. యువత తెలంగాణ జెండాలతో ర్యాలీలు నిర్వహించగా, మహిళలు ప్రత్యేకంగా పాల్గొని రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.

### రాజకీయంగా హోరెత్తిన తెలంగాణ దినోత్సవం

ఈ ఏడాది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఉప్పల్‌లో రాజకీయంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఏర్పాటులో తమ పాత్రను ప్రస్తావిస్తే, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, రాష్ట్ర అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేసింది. రెండు ప్రధాన రాజకీయ పక్షాలు తెలంగాణపై తమదైన ముద్రను చాటుకునేందుకు నిర్వహించిన కార్యక్రమాలతో ఉప్పల్ నియోజకవర్గం అంతా తెలంగాణ నినాదాలతో మారుమోగింది. తెలంగాణ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళులు అర్పిస్తూ, స్వరాష్ట్ర సాధన గాథను మరోసారి గుర్తు చేసుకుంటూ ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరితంగా జరిగాయి.

## తెలంగాణ అమరుల త్యాగలు మరువలేనివి

- టీయుడబ్ల్యూజె (హెచ్ - 143) యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు సూరమోని సత్యనారాయణ
- అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన యూనియన్ నాయకులు



**ఇబ్రహీంపట్నం, జూన్ 2(జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగలు మరువలేనివాని టీయుడబ్ల్యూజె (హెచ్ – 143) యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు డా" సూరమోని సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో సాగర్ రహదారిపై గల అమరవీరుల స్తూపానికి టీయుడబ్ల్యూజె (హెచ్ – 143) యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు డా" సూరమోని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగలు మరువలేనివని అన్నారు. తెలంగాణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేస్తూ ప్రాణాలను కోల్పోయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి సహకరించిన వారి సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మెలుగు శ్రీనివాస్, నియోజకవర్గ తెంజు అధ్యక్షులు వరికుప్పల అశోక్, సీనియర్ జర్నలిస్టులు దశరథ, చెరుకూరి మల్లేష్, హనుమంత్ సుదర్శన్, నల్లోల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగస్ఫూర్తితో విద్యా వైద్యం ఉద్యోగ అవకాశాలు అందరికి అందాలి

**బిజెపి రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి**



వికారాబాద్ జూన్ 2, (జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి మా శారద హాస్పిటల్ ఆవరణలో భారతీయ జనతా పార్టీ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## తెలంగాణ జెండా కేవలం వస్త్రం కాదు,అది కోట్ల మంది ఆత్మగౌరవ నినాదం

- ప్రతి ప్రయాణికున్నీ కుటుంబ సభ్యుడిగా భావించి సేవలు అందించాలని సిబ్బందికి పిలుపు
- ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) వై. నాగిరెడ్డి



**ముషీరాబాద్, జూన్ 02 (జనం సాక్షి):** తెలంగాణ జెండా అనేది కేవలం ఒక వస్త్రం కాదు, అది కోట్ల మంది ఆత్మగౌరవ నినాదం, లక్షలాది మంది పోరాటాల స్వేచ్ఛా గీతం" అని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) వై. నాగిరెడ్డి కొనియాడారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ బస్సు భవన్లో తెలంగాణ రాష్ట్ర 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలంగా సిద్ధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ, వారికి ఎండీ నాగిరెడ్డి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎండి వై నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రగతిని సాధించడంలోనూ దేశంలోనే సాటిలేని రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు అన్ని రంగాల్లో సాధించిన అద్భుత ప్రగతిలో మన తెలంగాణ ఆర్టీసీ కూడా ఒక ముఖ్యమైన భాగస్వామి కావడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఒకనాడు ఎన్నో సవాళ్లతో ఉన్న మన సంస్థ, నేడు ప్రజా రవాణాలో దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలిచింది అంటే దానికి కారణం మన ఉద్యోగుల క్రమశిక్షణ, కష్టం నిబద్ధత మాత్రమేనని అభినందించారు. ముఖ్యంగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం సంస్థ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిందని వివరించారు. ఈ పథకం ద్వారా కోట్లాది మంది మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారన్నారు. ప్రస్తుత తరుణంలో మహిళల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే మహిళలకు రవాణా భారాన్ని తగ్గించడమే కాకుండా వారి ఉపాధి, విద్యా అవకాశాలను మెరుగుపరిచేలా ఈ పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఈ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల నుండి అద్భుతమైన స్పందన లభించిందని, సంస్థ ఇప్పటికే విజయవంతంగా 10వేల కోట్ల ఉచిత మహిళా ప్రయాణాలను పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని వెల్లడించారు. దీనితో పాటుగా మహిళా సంఘాలకు బస్సులు కేటాయించడం ద్వారా వారు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ సేవలని మరింత ఆధునీకరిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను ధ్యేయంగా పెట్టుకుని, కాలుష్య నివారణ కోసం పెద్ద ఎత్తున అధునాతన ఎలక్ట్రిక్ బస్సులను ఈ బస్సులను, సరికొత్త బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను అత్యంత విజయవంతంగా నడుపుతూ తెలంగాణ ఆర్టీసీ అన్ని రాష్ట్రాలకు ఒక ఆదర్శంగా నిలిచిందని గర్వంగా ప్రకటించారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ చెల్లింపులు, లైవ్ బస్ ట్రాకింగ్ వంటి ఆధునిక సాంకేతిక మార్పులను సంస్థలో విజయవంతంగా అమలు చేస్తున్నట్లు నాగిరెడ్డి స్పష్టం చేశారు.బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగినప్పటికీ, డ్రైవర్లు, కండక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతో ఓపికతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేస్తున్నందుకు మీ అందరికీ నా ప్రత్యేక అభినందనలు తెలిపారు. సంస్థ ఎదుగుదలతో పాటు కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు. ఉద్యోగుల శ్రేయస్సును కాపాడటంలో, వారి జీతభత్యాలు మరియు ఇతర ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ మనకు ఆర్థికంగా, నైతికంగా అండగా నిలుస్తోందని,భవిష్యత్తు లో కూడా కార్మికుల సంక్షేమానికి ఎలాంటి లోటు రానివ్వమని ఈ వేదికగా స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే మన ప్రథమ కర్తవ్యం" అని, ప్రమాద రహిత ప్రయాణాన్ని అందించడమే మన ఏకైక లక్ష్యం కావాలని ఎండీ ఉద్ఘాటించారు. బస్సు ఎక్కే ప్రతి ప్రయాణికుడిని మన కుటుంబ సభ్యుడిగా భావించి, మర్యాదపూర్వకమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో సంస్థపై నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లను అధిగమిస్తూ, లాభాల బాటలోకి పయనిస్తూ, తెలంగాణ ప్రజల గుండెల్లో నమ్మకమైన రవాణా వారధిగా తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు మనమంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ . సిహెచ్.వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజయ పుష్ప , సిటీఎం శ్రీధర్,సిపిఎం ఉషాదేవి, సిటీఎం ట్రాఫిక్ శ్రీదేవి, కవిత , శ ప్రభులత పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో

# పాల్గొన్న ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, జూన్ 2 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారస పార్టీ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో నిర్వహించిన వేడుక లలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారు లచే జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులకు ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీశ్ యాదవ్, సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కోసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్ర రెడ్డి, కెకెఎల్ గౌడ్, పరమేష్ గౌడ్, అనిల్ కుమార్, బాలరాజ్, రవి, నర్సింహా యాదవ్, నాగార్జున రెడ్డి, పుణ్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర తెలుగుదేశం అధినేత సూచనలతో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తుంది

### బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్



**ముషీరాబాద్, జూన్ 02 (జనం సాక్షి):** ఆంధ్ర తెలుగుదేశం పార్టీ అధినేత సూచనలతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తోందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం రాంనగర్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో చావు అంచుల వరకు వెళ్లి పోరాడిన మహనీయుడు కేసీఆర్ అని, అమరుల త్యాగాల పునాదులపై ఆవిర్భవించిన తెలంగాణ, 9 సంవత్సరాల టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాలలో ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని, విద్యా వికాసం, విజ్ఞాన ప్రగతి, సాగునీటి సమృద్ధి, వ్యవసాయాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణతో సర్వతోముఖ అభివృద్ధి సాధించిందని ఇప్పుడు ఆంధ్రపాలకుల కనుసన్నలలో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం నాశనం అవుతుందని విమర్శించారు.

## అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

- జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్.



**ఇబ్రహీంపట్నం, జూన్ 2(జనం సాక్షి )** అమరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రంగారెడ్డి జిల్లా టిఎన్జీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనులు తెలంగాణ ఉద్యమంలో ప్రాణాల అర్పించారని తెలిపారు. స్వా రాష్ట్ర సాధనలో ఎన్జీవో సంఘం ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. రాష్ట్రం వచ్చేవరకు టీఎన్జీవో సంఘ ఆధ్వర్యంలో ఉద్యమాలను నిర్విరామంగా కొనసాగించిందని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రావు,నాయకులు ఏం మాధవ్ గౌడ్,ఆనంద్ సింగ్ ,రాజశేఖర్, కె శ్రీనివాస్ ,జి నాగేష్ ,అన్నపూర్ణ గాయత్రి ,వాణి ,విజిత సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుల భర్తీ

**ఇబ్రహీంపట్నం, జూన్ 2(జనం సాక్షి**
రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలోని 6, 7, 8 తరగతులకు మ్యాథమెటిక్స్ టీచర్ అర్హత: ఎం ఎస్సీ మాథ్స్ మరియు టెట్ , అలాగే ప్లస్ టూ/ఇంటర్మీడియట్ బోధనకు తెలుగు లెక్చరర్ అర్హత: యం ఎ తెలుగు , టెట్ మరియు నెట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 18,200/- గౌరవ వేతనం చెల్లించబడుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 12వ తేదీన రాత పరీక్ష నిర్వహించి, అందులో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ ద్వారా ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**బొంరాస్ పేట, జూన్ 2(జనం సాక్షి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు,ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీలు,పాఠశాలల్లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన అమరవీరులకు నివాళులర్పించారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు సురేష్మరణీయం



**నిజాంపేట్ జూన్ 2( జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతి నగర్, ఉషోదయం కాలనీ, గాజులరామారం మరియు గాంధీ నగర్‌లలో నిర్వహించిన పలు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి , జెండా ఆవిష్కరణ చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించి తెలంగాణ యావత్ ప్రజానీకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి నినాదాలు చేస్తూ తెలంగాణ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు.

## గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులు

### పారిశుధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు



**తాండూరు జూన్ 2(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని యాలాల మండలం దేవనూర్ గ్రామంలో వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిలో, పరిశు భ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ సర్పంచ్ వారిని శాలువాలతో సత్కరించారు. కార్మికులకు కొత్త బట్టలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అమోఘం. వర్షం, ఎండ అనకుండా వారు చేసే సేవ తెలంగాణ స్ఫూర్తికి ప్రతీక. వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో మిఠాయిలు పంచిపెట్టారు.

## తెలంగాణ భావజాలానికి ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శి

### బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు పటేల్



**తాండూరు జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర చిరస్మరణీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో బషీరాబాద్ మండల పరిధిలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పట్టణంలోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు సమర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ ఆలోచనకు బలమైన పునాది వేసిన మహనీయుల కృషిని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు.

## వాడవాడలా బిఆర్ఎస్ శ్రేణుల తెలంగాణ గులాబీ పతాకం



**నిజాంపేట్ జూన్ 2( జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచనల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ లోని అన్నీ డివిజన్లు, జీహెచ్ఎంసీ నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి సర్కిల్ పరిధి లోని వాడవాడలా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయ జెండాతో పాటు గులాబీ జెండాను ఎగురవేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అడుగడుగునా వివక్షతకు, అవమానాలకు గురైన తెలంగాణ ప్రాంతాన్ని ఎన్నో త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి సుభిక్షంగా చేసిన నాయకులు కెసిఆర్ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్ర ప్రధాన నిలిపిన ఘనత కేసిఆర్ మాత్రమే అని, కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేసిన ఘనత మన ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కు దక్కుతుందన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండాను మరో మారు రెపరెపలాడించేలా నాయకులు, కార్యకర్తలందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, అభిమానులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### డిసిసిబి డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి




**మోమిన్ పేట జూన్ 02 ( జనం సాక్షి)** జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్ మేక వనం పల్లి పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల అంజిరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేక వనం పల్లి పిఎసిఎస్ కార్యాలయంలో డిసిసిబి డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల నుండి రసీదు తో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ తీసుకురావాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు తాము పండించిన జొన్నలను ఎం ఎస్ పి 3,699 రూపాయలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేస్తున్నామని, ఈ కొనుగోలు కేంద్రాన్ని పరిసరాల రైతులు జొన్నలను తరలించి లబ్ధి పొందాలని ఆయన సూచించారు, రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించినట్లయితే ఎలాంటి దళారుల పాలు కాకుండా నేరుగా రైతు ఖాతాలోని డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు.మేక వనం పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రం నడుస్తున్నందున మారుమూల గ్రామాల రైతులు అందరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొనింటి సుశీల పిఎసిఎస్ వైస్ చైర్మన్ బొబ్బిలి వినయ్ కుమార్, పాలకవర్గ సభ్యులు రాజు, పెద్ద బోయిని శేఖర్, కే. సోమిరెడ్డి, లంబాడి బస్స, మడుగుల పోచమ్మ, సువర్ణ, భాగయ్య, గోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పిఎసిఎస్ కార్యదర్శి మహమ్మద్ జహంగీర్, మాజీ ఎంపిటిసి గోవర్ధన్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకుడు నీలి రాములు పిఎసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల తెలంగాణ ను అభివృద్ధి చేసుకునే బాధ్యత మనందరికి ఉంది

### తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో మాజీ మేయర్ అజయ్ యాదవ్




**బోడుప్పల్-జనంసాక్షి** అనేకమంది వీరుల త్యాగాల ద్వారా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత తెలంగాణ పౌరులుగా మనందరిపై ఉందని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ కార్యాలయం మరియు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అజయ్ యాదవ్ మాట్లాడుతూ నాలుగు కోట్ల మంది ప్రజల చిరకాల కళను నెరవేర్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత తల్లి సోనియా గాందికే దక్కుతుందని అన్నారు.

# విశిష్ట సేవలకు నిరంజన్‌కు సన్మానం





**రాజేంద్రనగర్, జూన్2(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మణికొండ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వి. నిరంజన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణ రెడ్డి మణికొండ జిల్లా పరిషత్ పాఠశాలలో నిరంజన్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ అందిస్తూ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, బషీర్, శ్రవణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహావీర్ హాస్పిటల్‌లో వైద్యుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## బిజెపి రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి



**వికారాబాద్ జూన్ 2, (జనంసాక్షి):** వికారాబాద్ పట్టణంలోని మహావీర్ హాస్పిటల్‌లో ఇటీవల ఓ రోగి బంధువులు వైద్యుడిపై దాడి చేయడం, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో దురుసుగా ప్రవర్తించడం అత్యంత విచారకరమైనది, ఖండించదగినదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా, కొందరు స్థానిక రాజకీయ నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వ్యక్తిగతంగా దూషిస్తూ, అవమానకర వ్యాఖ్యలు చేయడం కూడా తీవ్రంగా అభ్యంతరకరమని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం రాత్రింబవళ్లు సేవలందించే వైద్యులపై, వైద్య సిబ్బందిపై ఇలాంటి ప్రవర్తన సమాజానికి మంచి సంకేతం కాదన్నారు. వైద్యులు తమ విధులను నిర్వర్తిస్తూ రోగుల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తుంటారు. అలాంటి సేవాభావంతో పనిచేసే వైద్యులపై దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం వల్ల వారి మనోధైర్యం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య వృత్తి గౌరవాన్ని కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదన్నారు, ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వికారాబాద్ పట్టణ సీఐను డాక్టర్ రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. డాక్టర్లపై దాడులు కొనసాగితే వైద్యులు భయాందోళనలకు గురై సేవలందించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందాలంటే వైద్యుల భద్రతకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వైద్యులు మరియు వైద్య సిబ్బందికి సురక్షిత వాతావరణం కల్పించాలని ఆయన కోరారు, వైద్యుల భద్రతే రోగుల భద్రతకు పునాది అని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎల్బీనగర్ గడ్డపై శ్రీకాంత్ చారి త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది

## మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, జూన్ 2 (జనం సాక్షి)** భారతీయ జనతా పార్టీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో హయత్ నగర్ గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ జెండాను అవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భారతీయ జనతా పార్టీ పోషించిన పాత్రను గుర్తు చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలిపిందని, స్వర్గీయ సుష్మా స్వరాజ్ తెలంగాణ బిల్లుకు మద్దతుగా చేసిన చారిత్రాత్మక ప్రసంగం తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల పోరాటాలను స్మరించుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం కోసం ఎల్‌బీ నగర్ గడ్డపై ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంత్ చారి త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పొరంద మహేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీత, నాయకులు జనార్ధన్, గంగాని రాము, ఈటబోయిన నరసింహ, శక్తి సింగ్ , సూర్య నాయక్, అమల్, సురేష్ రెడ్డి, మొగులయ్య, బాలు నాయక్, ఉగాది బాలు, ఎర్ర శ్రీనివాస్, ప్రవీణ్, అరుణ్, మంజు, సైదమ్మ, ప్రేమలత, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్, డివిజన్ అధ్యక్షులు అఖిలేష్ ,అఖిలాష్, ప్రణవ్, నాగరాజ్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**మల్కాజిగిరి జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మల్కాజిగిరి నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ నాయకుడు జేపీసీ వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంచి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి చావంచుల వరకు వెళ్లి వచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి టిఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ దే అని గుర్తు చేశారు.

# బూర్గులలో ఘనంగా జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల్ బూర్గుల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నాడు గ్రామ సర్పంచ్ చిల్కమర్రి రాజు గోపాల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ప్రజల అభివృద్ధి,సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి కి ప్రజలందరూ సహకరించాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ శివలీల రాజేందర్, వార్డ్ మెంబర్స్, కవిత పరుశరామ్, సత్యనారాయణ, స్వప్న, పవన్ కుమార్, సంతోష్ కుమార్ గౌడ్, హరిశ్వర్,శేఖర్, జంగయ్య,రాము, కారోబార్ చెంద్రయ్య,అంగన్వాడీ టీచర్స్, బుక్ కీపర్స్, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నిజాంపేట్ జూన్ 2:( జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుండిగల్ సర్కిల్-59 కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# సోనియాగాంధీనగర్ కాలనీ ఫేజ్ 01లో కప్పు సాసర్: ప్యానెల్ ఘన విజయం

## కాలనీ అధ్యక్షుడుగా సిద్ది రాములు ఎన్నిక



**కాప్రా, జూన్ 02 ( జనం సాక్షి) :** చర్లపల్లి డివిజన్ సోనియాగాంధీనగర్ కాలనీ ఫేజ్ 01 సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఎమ్ఎన్ చారీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో కప్పు సాసర్, గంట గుర్తులతో రెండు ప్యానెల్లు పోటీ పడగా కప్పు సాసర్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈఎన్నికల్లో కాలనీ అధ్యక్షుడుగా సిద్దిరాములు ఉపాధ్యక్షుడుగా కన్నె మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా అలుపుల క్రిష్ణ, కోశాధికారిగా మోడెంరాజు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్ లను అత్యధిక మేజార్టీతో గెలుపొందారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సిద్ది రాములు మాట్లాడుతూ ప్రజాప్రతినిదులు, అధికారుల, కాలనీవాసులందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మాపై నమ్మకంతో తమను ఎన్నుకున్న కాలనీవాసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాలనీపెద్దలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మల్కాజిగిరి జూన్ 2(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జోనల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం వేడుకలను ఘనంగా నిర్వహించారు. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**యాలాల జూన్ 2 ( జనం సాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యాలాల మండల కేంద్రంలో తెలంగాణ తల్లికి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ కి పూలమాలలు సమర్పించి,జెండా ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ సి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల బలిదానాలు, న్యాయవాదుల మరియు ఉద్యోగ సంఘాల పోరాట ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణను మనమందరం జాగ్రత్తమై వెనకబడి పోకుండా కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాల శ్రీనివాస్, మల్లారెడ్డి, వడ్డే రాములు మరియు యాలాల మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌పై
### కించపరిచే బ్యానర్లకు వ్యతిరేకంగా బీజేపీ నాయకుల ఫిర్యాదు



**ఉప్పల్, జూన్ 2 (జనం సాక్షి):** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కించపరిచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బ్యానర్లను తెలంగాణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, రాష్ట్రంలో బీజేపీ పెరుగుతున్న ప్రభావాన్ని చూసి ప్రత్యర్థి రాజకీయ శక్తులు అసహనంతో వ్యవహరిస్తున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మర్నేని ఫణీంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈటల రాజేందర్‌ను కించపరిచే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేసిన వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చిలకనగర్ కార్పొరేటర్ గోనె శ్రీకాంత్, ఉప్పల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్, నామ శ్రవణ్, ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, సీనియర్ నాయకుడు ఫకీర్ నర్సిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మద్దెల పద్మ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జయరాం, యువ మోర్చా అధ్యక్షుడు ఆడెపు రమేష్, రాచకొండ శివ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
### జాతీయ జెండా ఆవిష్కరించిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మందసంజీవ రెడ్డి



**బోడుప్పల్- జనంసాక్షి** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మంగళవారం బోడుప్పల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలిముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వాన్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఆవిర్భావం వెనుక ఉన్న ఉద్యమ చరిత్రను కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోట్లాది ప్రజల కల.. ఆ కలను సాకారం చేయడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

## పీర్జాదిగూడలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
### జాతీయ జెండా ఆవిష్కరించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలిముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఆవిర్భావం వెనుక ఉన్న ఉద్యమ చరిత్రను కొనియాడారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం అనేది కోట్లాది ప్రజల కల. ఆ కలను సాకారం చేయడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## సిపిఐ అధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**బోడుప్పల్-జనంసాక్షి:** బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్ లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను భగత్ సింగ్ నగర్ కాలనీలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు వి.బి బాలరాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

## సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



**మల్కాజిగిరి జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో జాతీయ జెండా ఆవిష్కరణ చేసి సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఉద్యమ కారులు గుండా నిరంజన్, రాందాస్ సంతోష్ ముదిరాజ్ చంద్రకాంత్,కార్తిక్, శ్రీనివాస్, అరుణ్, పార్థసారధి,కుమార్,గణేశ్ లను శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్,బి కే శ్రీనివాస్, సతీష్ కుమార్,సిరిగిరి నర్సింగ్ రావు,ఎస్ ఆర్ ప్రసాద్, జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, వైనాల ప్రవీణ్,సయ్యద్ యూసుఫ్ బాయ్, పిట్టల నాగరాజు, శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మీ, బాబు సత్యనారాయణ,కుట్టి శ్రీనివాస్, రామచందర్, వెంకన్న, శ్రీరామ్ యాదవ్,సురేష్ సింగ్,కన్నెమల నాగరాజు, ప్రభా, ఆశా,సుమలత యాదవ్,కనకలక్ష్మి,సిరిగిరి రాజు, సనాది శంకర్,సందీప్ గౌడ్,సయ్యద్ మబ్బు,ఫరీద్, మౌసిన్, మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ



**శామీర్ పేట, జూన్ 2 (జనం సాక్షి )** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ్ సంఘం ఆధ్వర్యంలో అన్న దానం చేపట్టగా శామీర్ పేట పెద్దమ్మ కాలనీకి చెందిన పాల్గుని ప్రియ సాహు వారి కుటుంబ సభ్యులు, కరీంనగర్ కు చెందిన పాదం రమేష్ వారి కుటుంబ సభ్యులు, శామీర్ పేట కు చెందిన బండి బాల్ రాజ్ గౌడ్ - మహేశ్వరి దంపతులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా రవి యాదవ్



**మర్పల్లి, జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మర్పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవి యాదవ్‌కు ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా ప్రశంసాపత్రం అందజేశారు. మంగళవారం వికారాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అధికారుల చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, క్రమశిక్షణ, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తం, కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రవి కుమార్ యాదవ్‌ను అభినందించారు. సహోద్యోగులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అవార్డు అందుకోవడం పట్ల రవి యాదవ్ హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య
- మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి



**చేవెళ్ల, జూన్ 02 (జనంసాక్షి)** అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం, అమరవీరుల ఆశయ సాధన కోసం పనిచేయడమే మనందరి లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర బావ దినోత్సవం సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో సర్పంచులు జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకొని వారికి ఘన నివాళులు అర్పించారు.

## దేవరయాంజాల్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



**శామీర్ పేట్, జూన్ 2( జనం సాక్షి )**శామీర్‌పేట్ డివిజన్‌లోని దేవరయాంజాల్ గ్రామం లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి ,పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించిన గ్రామ సర్పంచ్ లింగారం రామలింగం గౌడ్



**జనంసాక్షి ఫరూఖ్ నగర్** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల్ కాశిరెడ్డి గూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ లింగారం రామలింగం గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.అనంతరం గ్రామ అభివృద్ధి మరియు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ లింగారం కుమార్ గౌడ్ గ్రామంలోని ప్రతి ఇంటికి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.అదేవిధంగా గ్రామ యువత అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు ప్రోత్సాహకంగా రూ.51,000/- విరాళం అందజేశారు.

## మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

- దివ్యాంగులకు ఉపకరణాలు,ఎమ్ ఆర్ కిట్స్ పంపిణీ
- బుద్ధి మాంధ్యత జ్యోతి పదవ తరగతి ఉత్తీర్ణత
- ఎంపీడీవో ఉషశ్రీ చేతుల మీదుగా సన్మానం

**కొడంగల్ ,జూన్ 02( జనం సాక్షి):** కొడంగల్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోతెలంగాణ ఆవిర్భావ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌సీలో సేవలు పొందుతున్న దివ్యాంగురాలు బుర్ర జ్యోతి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించినందుకు ఎంపీడీవో ఉషశ్రీ మేడం చేతుల మీదుగా సన్మానించారు.అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాలు, ప్రత్యేక విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. బొంగు శ్రీహరి, ఐసా బేగం, మహీన్ బేగం, అరవింద్‌లకు స్పెషల్ ఎడ్యుకేషన్ మెటీరియల్ (ఎంఆర్ కిట్స్) అందజేశారు. అశ్వినికి ట్రైసైకిల్, కే. హర్షవర్ధన్‌కు వీల్‌చైర్/వాకర్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ బాలకృష్ణ రెడ్డి,ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ, ఏపీఎం గోపాల్, ఏపీవో రాములు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి మాసనమ్మ, ఎన్‌హెచ్‌సీ సీసీ మోనమ్మ, సీసీలు ఆర్. రాములు, అరవింద్, బసంత్ కుమార్, వాణిశ్రీ, అకౌంటెంట్ పుష్పలత, ఆపరేటర్ విజయ్, ఆర్పీఎం టీచర్ సరళ, ఎన్‌హెచ్‌సీ సిబ్బంది, మంగమ్మ, యాక్టివిస్ట్ లక్ష్మి, ఆయా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**శేరిలింగంపల్లి, జూన్ 02 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను ప్రారంభిస్తూ పతాకావిష్కరణ గావించారు. వేడుకలను కోలాహలంగా నిర్వహించడంతో జోనల్ కార్యాలయ ఆవరణ మొత్తం తెలంగాణ ప్రాంతీయ భావనతో నిండిపోయింది. ఈ సందర్భంగా తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమ తీరుతెన్నులను గుర్తు చేసుకుంటూ నాటి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

## ప్రభుత్వ కార్యాలయలలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు



**శామీర్ పేట్, జూన్ 2(జనం సాక్షి )** తెలంగాణ అవతరణ దినోత్సవం పురస్కరించు కొని శామీర్ పేట్ మండల కార్యాలయంలో డిప్యుటీ తహసీల్దార్ మల్లి ఖార్జున్,అలియా బాద్ మున్సిపల్ కార్యా లయంలో కమీషనర్ వెంకట్ రెడ్డి, చైర్మన్ శిరిష కృష్ణారెడ్డి, ఎంసి పల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జాంరవి,కమీషనర్ పవన్ కుమార్,పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎం ఈ ఓ కమలాకర్, వ్యవసాయ కార్యాలయంలో ఏ ఓ రమేష్, మహిళ బ్యాంకు వద్ద మేనేజర్ సునీత, డ్వాక్రా కార్యా లయం వద్ద జిల్లా అధ్యక్షురాలు అజయలక్ష్మిలు జెండా విష్కరణ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలోని ఏ-టైప్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించిన చింతల రవికుమార్



**హయత్ నగర్, జూన్ 2 (జనం సాక్షి)** వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో ఏ-టైప్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, తెలంగాణ అన్ని రంగాల్లో పురోగతి సాధించి సుభిక్ష రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తలు పరస్పరం స్వీట్లు పంచుకొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లాగోని శ్రీధర్ గౌడ్, మధుగౌడ్, పి.వి. నర్సింహారావు, గడల రాజు, అజయ్ యాదవ్, ఏ-టైప్ కాలనీ మహిళా అధ్యక్షురాలు లత ఆనందరాజ్, బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు ఇల్యాస్ భాయ్, నవీద్, కిషోర్ కుమార్, వెన్నెల, పద్మక్క, శ్రీలత, వంశీధర్ రెడ్డి, పరమేష్ గౌడ్, సాయికుమార్, కాలనీ పెద్దలు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**మల్కాజిగిరి జూన్ 2 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆవిర్భావ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిఐ సందీప్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం సమర్పించారు.విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్ఐ పుల్లా రెడ్డి, ఏ ఎస్ఐ సుధాకర్ లను శాలువాలతో సత్కరించి ప్రభుత్వ సేవా పథకం అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది వారిద్దరినీ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.విధుల్లో వారు చూపించిన నైపుణ్యం, సాహసాన్ని గుర్తించి ప్రభుత్వం వారికి సేవా పథకాన్ని ప్రకటించడం అందరికీ ఎంతో గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సమాజ సేవలో వారి అంకితభావానికి దక్కిన సరైన గౌరవం ఇది. వారిని ఇలా చిరు సత్కారంతో గౌరవించుకోవడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

## కాప్రాలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**కాప్రా, జూన్ 2 (జనం సాక్షి ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్లో రాధిక చౌరస్తాలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల ఆశయాలకు సాధించాలన్నారు.జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అసమానతలు, అవమానాలు, అణిచివేతల నుండి విముక్తి పొంది స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన చారిత్రక దినమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు , దేవేందర్ రెడ్డి, శిరీష సోమ శేఖర్ రెడ్డి గారు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పెద్దాపురం కుమారస్వామి, బేతాళ బాల్రాజ్, మురళి పంతులు,బోదాస్ రవి, రమేష్ రహీం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంసి పరిధిలో కోలాహలంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**శేరిలింగంపల్లి, జూన్ 02 (జనంసాక్షి) :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేషన్ కమిషనర్ సృజన హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి తెలంగాణ అమరవీరులకు నివాళులను అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వినూత్న ఆలోచనలు, సమగ్ర అభివృద్ధి, ప్రజాకేంద్రిత పాలనతో దేశంలోనే అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, సంకల్పబలం మరియు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రం నేడు భారతదేశంలో దూసుకు వెళ్తుందని, దీనికి వివిధ ప్రభుత్వ శాఖల నిబద్ధతతో కూడిన పరిపాలన ఒక ఉదాహరణగా ఆమె అభివర్ణించారు. తెలంగాణ సాధించిన విజయాలు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్ఫూర్తినిస్తున్నాయని, మెరుగైన పౌర సేవలు, సుస్థిర మౌలిక సదుపాయాలు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల తన తొలి 100 రోజుల సేవలను పూర్తి చేసుకుందని కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకోవడం, స్థానిక సమస్యలను గుర్తించడం, పౌర సేవలను బలోపేతం చేయడం మరియు భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాదులు వేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో కూడిన పారదర్శక, బాధ్యతాయుత పాలన ద్వారా పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, స్మార్ట్ మరియు ప్రజాకేంద్రిత సైబరాబాద్ నిర్మాణానికి నిర్మాణాత్మక కృషి కొనసాగుతుందని సీఎం సి కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌరులు, ఇతర భాగస్వాముల సహకారంతో సైబరాబాద్‌ను ప్రగతిశీల తెలంగాణకు ప్రతిబింబంగా నిలిచే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని ఆమె భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ విభాగాల ఆధిపతులు, అధికారులు మరియు సిబ్బంది పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దోహదపడిన మహనీయుల త్యాగాలు, ఆకాంక్షలు మరియు దూరదృష్టిని స్మరించుకున్నారు. రాష్ట్రం సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో తమ వంతు పాత్ర పోషించేందుకు పునరంకిత భావంతో ముందుకు సాగాలని సంకల్పించారు.





# అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

## అధికారులను ఆదేశించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి(జనంసాక్షి) :** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులు,రెవెన్యూ డివిజనల్ అధికారులు, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, మున్సిపల్ శాఖ, పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ... జూన్ 4,6, 810 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని వార్డులలో గ్రామసభలను విస్తృత స్థాయిలో నిర్వహించాలన్నారు.ప్రతిసభను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపడుతున్న కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి అధికారి చురుకుగా పనిచేయాలన్నారు.ఓటరు జాబితా సవరణ,కొత్త ఓటర్ల నమోదు,మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు.జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి,కిరణ్మయి,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఘనంగా జెండా ఆవిష్కరణ

**దివ్యాంగులకు ఉపకరణాలు,ఎమ్ ఆర్ కిట్స్ పంపిణీ**

**బుద్ధి మాంధ్యత జ్యోతి పదవ తరగతి ఉత్తీర్ణత**

**ఎంపీడీవో ఉషశ్రీ చేతుల మీదుగా సన్మానం**

**కొడంగల్, జూన్ 02(జనంసాక్షి) :** కొడంగల్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోతెలంగాణ ఆవిర్భావ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌సీలో సేవలు పొందుతున్న దివ్యాంగురాలు బుర్ర జ్యోతి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించినందుకు ఎంపీడీవో ఉషశ్రీ మేడం చేతుల మీదుగా సన్మానించారు.అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాలు, ప్రత్యేక విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. బొంగు శ్రీహరి, ఐసా బేగం, మహీన్ బేగం, అరవింద్‌లకు స్పెషల్ ఎడ్యుకేషన్ మెటీరియల్ (ఎంఆర్ కిట్స్) అందజేశారు. అశ్వినికి ట్రైసైకిల్, కే. హర్షవర్ధన్‌కు వీల్‌చైర్/వాకర్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ బాలకృష్ణ రెడ్డి,ఐసీడీఎస్ సూపర్వైజర్ సరోజ, ఏపీఎం గోపాల్, ఏపీవో రాములు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి మాసనమ్మ, ఎన్‌హెచ్‌సీ సీసీ మోనమ్మ, సీసీలు ఆర్. రాములు, అరవింద్, బసంత్ కుమార్, వాణిశ్రీ, అకౌంటెంట్ పుష్పలత, ఆపరేటర్ విజయ్, ఆర్పీఎం టీచర్ సరళ, ఎన్‌హెచ్‌సీ సిబ్బంది, మంగమ్మ, యాక్టివిస్ట్ లక్ష్మి, ఆయా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.





# మణికొండలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**రాజేంద్రనగర్, జూన్2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మణికొండలోని వెంకటేశ్వర కాలనీలో టీఆర్ఎస్ నాయకుడు సీతారాం దూళిపాల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోమో ఉపేంద్రనాథ్ రెడ్డి, మహమ్మద్ అరిఫ్, శ్రీకాంత్, షేక్ అరీఫ్, అందె లక్ష్మణ్, సుమనలిని తదితరులు పాల్గొన్నారు.

# కాటేదాన్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**రాజేంద్రనగర్, జూన్2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాటేదాన్ డివిజన్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, రమేష్ ముదిరాజ్, లక్ష్మిరాజ్, రాము యాదవ్, రాఘవేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం

## గద్వాల విజయలక్ష్మి



**బోడుప్పల్-జనంసాక్షి :** యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అవేర్‌నెస్ అసోసియేషన్ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, చట్టపరమైన అవగాహన, భద్రత, సాధికారత అంశాలపై చర్చించారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రతినిధులు వివరించారు. సంస్థ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను గద్వాల విజయలక్ష్మి అభినందించారు. సమావేశంలో సమావేశంలో సంస్థ చైర్మన్ డి. కమలాకర్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరాజ్ ఫాతిమా, మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బత్తిని మీనా, మేడిపల్లి మహిళా అధ్యక్షురాలు ఎ. మాలతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జి. లలిత, లీగల్ సెల్ అడ్వైజర్ కె. నాగజ్యోతి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కే.కే. చారి, జనరల్ సెక్రటరీ వి. నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ కదం తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

### రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధే కనిపిస్తుంది

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం,జూన్2(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రానికి మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని పీఎస్ వై ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కేసిఆర్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రగతి ప్రణాళికలో గ్రామాలకు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదన్నారు.మహేశ్వరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్ రెడ్డి నెలలో పది సార్లు వస్తున్నాడు.కాని మహేశ్వరం,ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు.రాబోయే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజల పక్షాన నిలబడాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు చిలకమర్రి నర్సింహ,పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్,వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్,నాయకులు పోతర్ల అంబయ్య యాదవ్,కర్రోల్ల చంద్రయ్య ముదిరాజు,పలు గ్రామాల సర్పంచులు,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్‌లో తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్



**ఖైరతాబాద్, జూన్ 02 (జనం సాక్షి)** : హుస్సేన్ సాగర్‌లో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 17వ మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజున మల్కాజ్‌గిరికి చెందిన 13 ఏళ్ల నిల్కొండ మణి సంచలన విజయం సాధించాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా షె డ్యూల్‌లోని మూడు రేసుల్లో ఒకే రేసు నిర్వహించ గా, మణి తన సమీప ప్రత్యర్థిపై దాదాపు రెండు నిమిషాల ఆధిక్యంతో మొదటి స్థానంలో నిలిచాడు బాలుర అండర్-15 విభాగంలో నిల్కొండ మణి 1పాయింట్ అగ్రస్థానంలో ఉండగా, వుట్ల నరసిం హ, 2 పాయింట్లు, కొండ సమన్యు,3 పాయింట్లు తరువాతి స్థానాల్లో నిలిచారు. బాలికల అండర్ 15 విభాగంలో సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన సృష్టి సింగ్ అద్భుత ప్రదర్శనతో ఓవరాల్‌గా మూడో స్థానం, బాలికల విభాగంలో తొలి స్థానం సాధించిం ది. ఆమె 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, సాక్షి కుమారి 8 పాయింట్లు, శృంగారి రాయ్ 10 పాయింట్లు తరువాతి స్థానాల్లో నిలిచారు. ప్రతికూ ల వాతావరణం కారణంగా అండర్-18 రేసులు వాయిదా పడ్డాయి.

## మున్సిపాలిటీలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**మొయినాబాద్: జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షాబాద్ సోనియా దర్శన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గరుగు రాజు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.



# డ్రగ్స్‌ను అరికడదాం.. కదలిరండి

### ప్రతి పౌరుడు ముందుకు రావాలి : ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఐపిఎస్ పిలుపు



**కాప్రా, జూన్ 2 (జనంసాక్షి) :** డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఐపిఎస్ పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ కమ్యూనిటీ హాల్లో ఆంటీ డ్రగ్స్ ప్రోగ్రాం పై అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్ ఐపిఎస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో డ్రగ్స్ మహమ్మారితో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని డ్రగ్స్‌ను కఠినంగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి డ్రగ్స్ మత్తులో పడి యువత అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని వారిని మార్చేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కట్టడి చేయాలని తెలిపారు. గంజాయి డ్రగ్స్ తో కలిగే దుష్ప్రభావాలను వారికి వివరించి డ్రగ్స్ జోలికి వెళ్లకుండా నియంత్రించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత, కుటుంబాలు, సమాజంపై కలిగే దుష్పరిణామాల గురించి వివరించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు, యువతకు పిలుపునిచ్చారు. అనంతరం. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ శ్ సుమతి ఐపీస్ చేపట్టిన "మీ సురక్ష" కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించారు. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో మరియు సంస్థలలో పనిచేస్తున్న వాచ్‌మెన్‌లు, గృహ సహాయకులు (సర్వెంట్లు), డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది వివరాలను పోలీస్ శాఖ వద్ద నమోదు చేయించడం ద్వారా నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, సమాజంలో సురక్షిత వాతావరణం కల్పించడంలో ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, గృహ యజమానులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంతో పాటు ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖతో కలిసి పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై వెంకట్ రెడ్డి ఏసీపీ ఉప్పల్ డివిజన్ , కుషాయిగూడ డీఐ శ్రీ వెంకటేశ్వర్లు, ఎస్సైలు ఎన్.సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, సతీష్, విజయ్, కుషాయిగూడ స్టేషన్ అధికారులు, కాలనీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాట ఫలితమే స్వరాష్ట్రం

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూన్2(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది అనేక మంది అమరవీరుల ఆత్మబలిదానాలు, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సంఘటిత పోరాటాల ఫలితంగా సాధించుకున్న స్వరాష్ట్రం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు చేసిన ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని పేర్కొంటూ, రాష్ట్ర పురోగతికి అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

### అందించిన సయ్యద్ అలీపూర్ గ్రామ సర్పంచ్ ఉద్దాల లలిత జైపాల్

**మోమిన్‌పేట, జూన్ 02 (జనంసాక్షి)**



మోమిన్ పేట మండల పరిధిలోని సయ్యద్ అల్లిపూర్ గ్రామానికి చెందిన ఉద్దాల మొగులమ్మ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ఉద్దాల లలిత జైపాల్ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయం 5000 రూపాయలు నగదు అంత్యక్రియల నిమిత్తం గ్రామస్తులతో కలిసి అందజేసి కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నన్ను నమ్ముకుని ఓట్లు వేసి గెలిపించినందుకు మండల పరిధిలోని మారుమూల గ్రామమైన సయ్యద్ అలీపూర్ గ్రామంలో ఎవరికీ ఎలాంటి పరిస్థితిలోనైనా ఆపదలు వచ్చినా వారికి ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు వివాహాది శుభ కార్యాలకు కూడా తన వంతు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు ఉద్దాల మోహన్ పురుషోత్తం ఆనందం మల్లేశం తదితరులు పాల్గొన్నారు